# దేవుడు చేసిన బొమ్మలు

వసుంధర



పేదరికమన్నా, ముష్టివాళ్ళన్నా నాకు అసహ్యం. ఈ సృష్టిలో పేదరికానికి మించిన జుగుప్సాకర అనుభవంలేదు. పేదరికానికి ప్రతి

విధులుగా కనబడే కారణంవల్ల ముష్టివాళ్ళంటే ఏహ్యాభావం నాకు.

సృష్టిలో ఏ ఒక్కడూ డబ్బుతో పుట్టడు. భగవంతుడు మనిషికి తెలివితేటలను ఇచ్చాడు. అవి ఉపయోగించుకొని మనిషి పేదరికాన్ని అధిగమించాలి. పేదరికాన్ని అధిగమించడం ఎంతో కష్టంకాదు. కొద్దిపాటి తెలివి, శ్రమ ఇవేమీ ఉపయోగించదలచనివాడు ముష్టివాడౌతాడని నా అభిప్రాయం నా అభిప్రాయాలు నేను ఎవరితోనూ చర్చించను. నాకు తప్పు అభిప్రాయాలుండవని నా నమ్మకం. అందుకే ఆఖరికి నా భార్యతో కూడా నా అభిప్రాయాలు చర్చించను నేను.

నా భార్య పేదరికంలోంచే వచ్చిందిగానీ ముష్టిది కాదు. ఆమె నన్నాకర్షించింది. ఆమె నావంటి వాడి భార్యగా ఉండతగ్గది అనిపించింది. వెంటనే పెళ్ళి చేసుకొన్నాను. ఆమె పేదరికంలో ఉన్న కారణంగా నేను అడగ్గానే ఒప్పుకొంది. ఐతే నా భార్య అయ్యాక ఆమె నా అభిప్రాయాలతో ఎన్నడూ అంగీకరించలేదు. నేను చెప్పే ప్రతిదీ ఖండించేది. కాని నన్ను ప్రేమించేది! ఆమె నన్ను ఖండించినప్పుడల్లా నాకు ఉక్రోషం వచ్చేది. ఆమె ప్రేమ లాలనలో ఆగిపోయేది.

"నా మాట రైటని ఎందుకు ఒప్పుకోవు?" అన్నాను ఎన్నో సార్లు.

"రైటు కాదు కాబట్టి!"

"మరైతే నన్నెందుకు ప్రేమిస్తున్నావు?" అన్నాను చాలాసార్లు.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానని చెప్పానా?" అందామె అన్నిసార్లూ. అంటూనే ప్రేమగా లాలించేది. ఎంత ప్రేమగా లాలించేదంటే మా సంభాషణ అక్కడితో ఆగిపోయేది.

ఈ సృష్టిలో తెలివితేటలకంటె, కృషికంటె కూడా ముఖ్యమైనది మరొకటుంది. అది అదృష్టం అదృష్టవంతుడు తెలివైనవాడినని గర్వపడకూడదు. దురదృష్టవంతుడికి సాయం చేయాలి. చేయూతనివ్వాలి.

ఇది నా భార్య అమూల్యాభిప్రాయం. ఆమెతో వాదించి ప్రయోజనంలేదు. వాదనలో నన్నోడించే తెలివి ఆమెకు ఉంది. అందుకే ఆమెకు చెప్పేశాను. "నా అభిప్రాయాల్ని ఖండించడానికి ప్రయత్నించకు. నాకు నచ్చదు."

ఆమె నవ్వి "మీ మాటలు వినక తప్పదు. మగాడిగా పుట్టడం మీరు

చేసుకున్న అదృష్టం. ఆ అదృష్టా నికి నేను తలవంచక తప్పదు" అంది.

ఆ మాటల్లో చురక ఉంది. అది నేను పట్టించుకోలేదు.

నా భార్య తరచుగా నా గురించి అనేదేమిటంటే కళాహృదయం లేని మనిషి జన్మవ్యర్ధమట!

ఈ విషయమై నేను నా భార్యను ఖండించలేదు. ఎందు కంటే ఇవే మాటలు చాలామంది పెద్దలు, గొప్పవారు అన్నారు. అందువలన నేను నాకూ కళా హృదయమున్నదని నా భార్య దగ్గర ఋజువు చేసుకోవాలని అను కున్నాను. ఐతే అనుకోగానే ఇలాంటి పనులకు తలపడడానికి నేను సామాన్య మానవుడినా? ధనిక వర్గానికి చెందినవాడిని. నా తెలివి తేటల్ని డబ్బుగా మారుస్తున్న వాణ్ణి!

ఏమైతేనేం ఒకరోజు నాకు అవకాశం రానే వచ్చింది.

ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు నాకు ఆహ్వానం వచ్చింది. నేను శ్రీమతి దానికి కార్లో వెళ్ళాం. అక్కడ చేరిన వాళ్ళంతా నాకులాగే గొప్ప గొప్పవాళ్ళు.

ఆర్ట్ ఎగ్జిబిషన్లంటే అందుకే నాకు చాలా ఇష్టం. అక్కడికి అంతా ఉన్నవాళ్ళే వస్తారు. ఆకలి ముఖాలు మచ్చుకైనా కనబడవు. ఆకలి ముఖాలన్నా నాకు చిరాకే!

శ్రీమతి కళాఖండాల్ని చూస్తోంది. నేను వచ్చిన జనాల్ని చూస్తున్నాను. అలా కొంతసేపు గడిచింది.

"మీరు పెయింటింగ్స్ చూడడం లేదు." అంది శ్రీమతి.

నేను నవ్వాను "అలా ఎందు కనుకుంటున్నావు?"

శ్రీమతి కూడా నవ్వింది. "నేను అనుకుంటున్నది చెప్పలేను. చూసింది చెప్పాను."

వెంటనే నేను మాట్లాడలేదు. ఆ క్షణంనుంచీ పెయింటింగ్స్ చూడడం ఆరంభించాను. అప్పుడు గ్రహించాను. ఎంత బాగున్నాయి అవి! అన్నింటిలోనూ జీవకళ ఉట్టిపడుతోంది. వాటిని చూస్తుంటే నా హృదయంలో ఏదో తెలియని ఆనందం కలుగుతోంది. ఆ విషయం గుర్తించగానే ఆనందం కలిగినందుకూడా ఆనందం కలి గింది.

నా భార్య నాకు కళాహృదయం లేదన్నది. ఇప్పుడు కళను చూసి నా హృదయం స్పందిస్తున్నది.

అటువంటప్పుడు నాకు కళా హృదయం లేకుండా ఎలా పోతుంది?

ఈ విషయం నా భార్యకు చెప్పాను.

"చిత్రాల ఖరీదు చాలా ఎక్కువగా ఉంది. వీటిని చూసి ఆనందించడానికి అవసరమైన స్పందనకంటే కొనడానికే ఎక్కువ స్పందన కావాలి" అంది శ్రీమతి.

ఇలా చురకలు వేయడం ఆమెకు అలవాటే! ఇలాంటి చురకలు ఆమెనుంచి చాలా పొందాను. అయితే ఇప్పుడామె నన్ను సవాలు చేస్తున్నది. బొమ్మ చూసి ఆనందించడం కాదు, కొన గలవా? అని అడుగుతున్నది.

ఏ బొమ్మ ఖరీదు అయిదంకెలకు తక్కువలో లేదు. నాది డబ్బును వృధా చేసే మనస్తత్వం కాదు. కానీ కళాపోషణ డబ్బును వృధా చేయడం అవుతుందా?

మా తాతగారు పేదరికంలో పుట్టి మధ్యతరగతి దశకు ఎది గారు. మా నాన్నగారు మధ్య తరగతి దశనుంచి మరికాస్త పైకి ఎదిగారు. ఆయన నాతో తరచుగా అంటూండేవారు, "కారున్నంత మాత్రాన ధనికవర్గంలో చేరిపోము. ఇంటినిండా ఖరీదైన ఆయిల్ పెయింటింగ్సు వేలాడే పరిస్థితికి ఎదిగినప్పుడే మనం ధనికులమని పించుకుంటాము."

ఇప్పటి నా స్థితి బాగానే ఉంది. కానీ మనసే ఇంకా ఎదగాలను కుంటాను. అందుకే ఇంతకాలమూ కళాపోషణ మీదకు దృష్టి మరల లేదు. ఈ రోజు ఏ బొమ్మను చూపినా హృదయం స్పందిస్తోంది. బహుశా నేను మానసికంగా కూడా ఎదుగుతున్నానేమో!

ఈ రోజు కళాపోషణకు శ్రీకారం చుట్టాలనుకున్నాను. అందుకోసం అపురూపమైన తైల వర్ణచిత్రం కొనాలనుకున్నాను. ఈ అభిప్రాయంతో ఎగ్జిబిషనంతా కలయతిరిగాను. నన్నొక బొమ్మ ఆకర్షించింది.

జీవకళ నింపుకుని ఉన్నదది. చూడగానే దృష్టి మరల్చుకోలేక పోయాను. ఎముకల కతుక్కు పోయిన చర్మంతో, కళ్ళలో దైన్యంతో చేయి చాచి దేహీ అంటున్న బిచ్చగాడి బొమ్మ అది. నాకు పేదరికమన్నా, ముష్టివాళ్ళన్నా అసహ్యం కావచ్చు. కానీ ఈ బొమ్మ ఎంత గొప్పగా ఉంది!

"ఇది కొంటాను..." అన్నాను శ్రీమతితో.

ఆమె ఆశ్చర్యంగా, "దీని ఖరీదు పన్నాలుగువేల అయిదు వందలు..." అంది.

"స్పందించే కళాహృదయం డబ్బుకు చూడదు" అన్నాను గర్వంగా.

శ్రీమతి మాట్లాడలేదు. నేనా బొమ్మ కొన్నాను. అది కార్లోకి చేరేలోగా అక్కడ కొందరు నా అభిరుచిని అపరిమితంగా అభినందించారు.

తిరుగు ప్రయాణంలో కారు ట్రబులిచ్చింది. మధ్యలో కారు దిగాల్సొచ్చింది. డ్రైవర్ ట్రబులేమిటో చూస్తున్నాడు.

"ఎప్పుడూ ఇలా ట్రబులివ్వలేదు కారు." అన్నాను చిరాగ్గా.

"ఈరోజు విచిత్రాలు ఇంకా జరుగుతాయేమో" అంది శ్రీమతి.

నాకిలా చురకలు వేయడంలో ఆమె ఆనందం ఏమిటో? నేనేమీ అనలేదు కానీ సంభాషణ మార్చడం కోసం, "నీకు దేవుడి మీద నమ్మకముందా?" అన్నాను.

"ఇప్పుడా విషయమెందుకు?" అందామె.

"నేను దేవుణ్ణి నమ్ముతాను. నాకే ఇబ్బంది వచ్చినా ఆయన ఆదుకుంటాడు. అందుకని ఏ ఇబ్బందులూ నన్ను బాధపెట్టవు. మరి చిరాకుపడడమంటావా? అది మానవ సహజం. మనమిక్కడిలా ఆగవలసి రావడమే మంచిదేమో!" అన్నాను.

శ్రీమతి ఏమీ మాట్లాడలేదు.

నా ముందుకు ఏదో చేయి వచ్చింది. ఉలిక్కిపడ్డాను.

అది ఒక బిచ్చగాడిది. మొలకు చిన్న మాసిన గుడ్డ చుట్టుకుని ఉన్నాడు. మనిషి పూర్తిగా ఎండిపోయి ఉన్నాడు. వాడి కళ్ళలో ఆకలి!

"నాలుగు రోజుల్నుంచీ తిండి లేదు బాబూ!" అన్నాడు వాడు.

ఎప్పుడూ లేనిది నాకీ రోజు వాడంటే జాలివేసింది. చటుక్కున జేబులోంచి ఓ అయిదురూపాయల నోటు తీసిచ్చి, "పో, వెంటనే ఏదైనా కొనుక్కుని తిను" అన్నాను. వాడు నమ్మలేనట్లు నా వంక చూసి ఆ అయిదురూపాయల నోటు తీసుకుని వెళ్ళిపోయాడు.

శ్రీమతి నావంక విచిత్రంగా చూసింది. తర్వాత ఏమనుకుందో హడావుడిగా కార్లోకి తొంగి చూసి వచ్చి "హమ్మయ్య!" అంది.

"ఏం జరిగింది?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం లేదు. బొమ్మ పటంలోంచి వెళ్ళిపోయిందేమో ననుకున్నాను. అయినా పద్నాలుగువేల అయిదు వందలకొన్న బొమ్మ అయిదు రూపాయలుచ్చుకు పారిపోతుందా? పారిపోతే మీరూరుకుంటారా? ఈ ఆలోచన ముందే వస్తే కార్లోకి తొంగిచూసి ఉండేదాన్ని కాదు...."

మళ్ళీ చురక అంటించింది. నిజంగా ఉలిక్కిపడ్డాను ఈ సారి. నా దగ్గర అయిదు రూపాయలుచ్చుకున్న బిచ్చగాడు అచ్చం ఫోటోలో బొమ్మలాగే ఉన్నాడు. వాడేనేమిటి, అలాంటి వాళ్ళు ఊళ్ళో చాలా మంది ఉన్నారు.

"అయితే ఏమంటావు? వాడినీ పద్నాలుగువేల అయిదువందలిచ్చి కొని డ్రాయింగ్ రూం గోడకు తగిలించాలంటావా?" అన్నాను చిరాగ్గా.

"అయ్యో! నేనలా ఎందుకంటాను? మీరు దేవుణ్ణి నమ్ముతారు కదా! మనిషి వేసిన బొమ్మలకు లాగే దేవుడు చేసిన బొమ్మలకు మాత్రం విలువ కట్టలేరా?" అంది శ్రీమతి.

నా కళాహృదయం గురించీ, హృదయస్పందన గురించీ పడుతున్న గర్వమంతా ఒక్కసారి మంచులా కరిగిపోయింది. శ్రీమతి నాలో ఆశించిన హృదయస్పందన ఏమిటో ఇప్పుడు తెలిసింది. ఆ విధంగా నా హృదయం స్పందిస్తుందా అన్నది వేరే సంగతి!

దేవుడు చేసిన బొమ్మలను చూసి స్పందించే హృదయం మనుషులకుంటే మనుషులలో ఇన్ని తరగతులుండేవి కాదేమో! ●

## ఈ నెల సమస్య

మనిషి చేసిన బొమ్మలకి విలువ కట్టడం మంచిదా? దేవుడు చేసిన బొమ్మలకి విలువ కట్టడం మంచిదా? కళాఖండాల మీద వేలు ఖర్చు పెట్టే మనుషులు, వాస్తవంలో పేదలకి ధారాళంగా ఎందుకు సాయపడలేరు? ఓ వ్యక్తి తన కళా హృదయాన్నిగాని, మానవత్వాన్నిగాని రుజువు చేసుకునే సన్నివేశం వస్తే దేనికి 'ఓటు' వేయాలి? పాఠకులను చర్చకి ఆహ్వానిస్తున్నాం!